



Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com






ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 644 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర బుధవారం 21 జనవరి 2026 పేజీలు : 4 వెల : అమూల్యం




## అయోధ్య రాముడికి 286 కిలోల 'స్వర్ణ ధనస్సు'

### - పూరీకి చేరిన విల్లు

పూరీ, సింహగర్జన ప్రతినిధి, జనవరి 20 : అయోధ్య రామమందిరానికి అంకితమిస్తూ తయారు చేసిన 286 కిలోల 'స్వర్ణ ధనస్సు' ఒడిశాలోని పూరీకి చేరుకుంది. భక్తుల జయజయధ్వానాల మధ్య ఊరేగింపుగా మంగళవారం ఉత్తరపర్శ్వ మఠం వద్దకు దీనిని తీసుకొచ్చారు. భక్తులు స్వర్ణ ధనస్సును దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ భారీ విల్లును పంచ లోహాలతో తయారు చేసినట్లు ఇక్కడి పూజారి తెలిపారు.

### బలవంతంగా ట్రాఫిక్ చలాన్లు

# వసూలు చేయవద్దు:

### -హైకోర్టు కీలక ఆదేశాలు

తెలంగాణ హైకోర్టు వాహనాల పెండింగ్ చలాన్‌లపై కీలక ఆదేశాలు జారీ చేసింది. పెండింగ్ చలాన్‌ల విషయంలో వాహనదారులను బలవంత పెట్టవద్దని ట్రాఫిక్ పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ట్రాఫిక్ పోలీసులు బలవంతంగా చలాన్‌లు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై న్యాయవాది విజయ్ గోపాల్ వాదనలు వినిపించారు. పెండింగ్ చలాన్‌ల వసూలు కోసం ట్రాఫిక్ పోలీసులు వాహనదారులను ఇబ్బంది పెడుతున్నారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో హైకోర్టు ట్రాఫిక్ పోలీసులకు ఈ ఆదేశాలు జారీ చేసింది. చలాన్‌లు చెల్లించాలని వాహనాల తాళాలు లాక్కోవడం, వాహనాన్ని ఆపడం వంటి చర్యలకు పాల్పడవద్దని ట్రాఫిక్ పోలీసులకు సూచించింది. వాహనం ఆపినప్పుడు



వాహనదారు స్వచ్ఛందంగా చలాన్‌లు చెల్లిస్తే పోలీసులు వసూలు చేయవచ్చని పేర్కొంది. వాహనదారులు చలానా చెల్లించడానికి ఇష్టపడకుంటే చట్ట ప్రకారం వారికి నోటీసులు ఇవ్వాలని ఆదేశించింది.



### వాసవి మాత ఆశీస్సులు పిఠాపురం

# ప్రజలందరిపై ఉండాలి

### - డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి




పిఠాపురం, సింహగర్జన ప్రతినిధి, జనవరి 20 : వాసవి మాత ఆశీస్సులు పిఠాపురం ప్రజలపై మరియు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పిఠాపురం నియోజకవర్గం శాసనసభ్యుడు కొణిదల పవన్ కళ్యాణ్ పై ఎప్పుడు ఉండాలని కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) తెలిపారు. మంగళవారం పిఠాపురం పట్టణంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన వాసవి మాత హోమం, అష్టోత్తర శతనామావళి, పూజ కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా పిఠాపురం నియోజకవర్గ శాసనసభ్యుడు, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పేరు మీద శ్రీ గోత్ర నామాలతో ప్రత్యేక కుంకుమార్చన నిర్వహించి, వేద పండితులతో ఆశీర్వచనం అందజేశారు.

# మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి ఆ వెంకటేశ్వర స్వామి బుద్ధి, జ్ఞానం ప్రసాదించాలని కోరుకుంటున్నాను

**- వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని అప్రతిష్ట పాలు చేయాలని చూస్తే ఊరుకోం- వాడపల్లి దేవాలయ అభివృద్ధిని చూసి ఓర్వలేకే జగ్గిరెడ్డి విమర్శలు**

**- దేవాలయాన్ని అప్రతిష్టపాలు చేయడం కాదు నేరుగా నన్నే ఎదుర్కొండి - కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**

కొత్తపేట, సింహగర్జన ప్రతినిధి, జనవరి 20 : కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారికి వస్తున్న ఆదరణ, ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక, మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి వ్యక్తిగత కారణాలతో దేవాలయ ప్రతిష్ట దిగజారేలా లేనిపోని ఆరోపణలు చేయడం బాధాకరమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన వాడపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉండి మూడు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన వ్యక్తి ఇంగిత జ్ఞానం లేకుండా, ఆలయ ప్రతిష్ఠను పట్టించుకోకుండా వ్యవహరిస్తుంటే బాధేస్తుందన్నారు. అంతలా దిగజారి తాము మాట్లాడలేమన్నారు. మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి నోటికి వచ్చినట్లు పచ్చి అబద్ధాలు చెబుతున్నారని వ్యాఖ్యానించారు. తాను నాలుగోసారి ఎమ్మెల్యేగా పనిచేస్తున్నానని, మాజీ శాసనసభ్యుడు జగ్గిరెడ్డి మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేశారని ఆలయ ప్రతిష్టను దృష్టిలో పెట్టుకోకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు.





### నన్ను కాపాడటానికి అమ్మానాన్న,


# భర్త ఎవరూ లేరు

### -: రేణూ దేశాయ్ పోస్ట్

హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, జనవరి 20 : తనను కాపాడటానికి ఎవరూ లేరని నటి రేణూ దేశాయ్ పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం ఇది వైరల్‌గా మారింది. వీధి కుక్కలను చంపేయడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఈ విషయంలో తనను కొందరు విమర్శిస్తున్నారని, ఎన్ని విమర్శలు వచ్చినా తాను మాత్రం పోరాటం ఆపనని మరోసారి స్పష్టం చేశారు. తనను కాపాడటానికి అమ్మానాన్న, అన్నయ్య, భర్త ఎవరూ లేరు. తాజా అంశంపై



నా తప్పు లేకున్నా ఎంతోమంది నన్ను విమర్శిస్తున్నారు. మీరు చేసే వ్యాఖ్యలపై తిరిగి స్పందించను. నేను నమ్మే భగవంతుడి దగ్గర మాత్రమే నా బాధను చెబుతాను. ఆయన నా ప్రార్థనలు వింటాడన్న నమ్మకం నాకు ఉంది. నేను తరచూ కాశీకి ఎందుకు వెళ్తానో మీకు ఇప్పుడు అర్థమై ఉంటుంది అని అన్నారు. ఇక వీధి కుక్కలను చంపడంపై తన పోరాటం గురించి కూడా రేణు ఈ పోస్ట్లో రాసుకొచ్చారు. తానెప్పుడూ నా వ్యక్తిగత హక్కుల కోసం పోరాడలేదు. కానీ వీధి కుక్కల విషయంలో ఈ పోరాటం ఆపను. కొన్ని కుక్కలు చేసిన తప్పు వల్ల వందల సంఖ్యలో వాటిని చంపాలనే నిర్ణయం సరైనది కాదు. ఈ విషయాన్ని మీరు అర్థం చేసుకునే వరకూ పోరాడుతూనే ఉంటాను అని స్పష్టం చేశారు. ఇక ఈ అంశంపై రేణు ప్రెస్మీట్ అనంతరం ఆమె పొలిటికల్ పార్టీలో చేరనున్నారని వచ్చిన వార్తలపై కూడా స్పష్టతనిచ్చారు. తనకు అలాంటి ఉద్దేశం లేదన్నారు.

సింహగర్జన
www.simhagarjana.com



# పేదల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం.....

-రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

-కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ.2.54 కోట్ల చెక్కులు పంపిణీ చేసిన మంత్రి దామోదర రాజనర్సింహ




జనవరి 20) :మహిళా సాధికారత, పిల్లలకు నైపుణ్యాలతో కూడిన ప్రమాణవంతమైన విద్య, పేదల ఆరోగ్య భద్రతకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మంగళవారం సంగారెడ్డిలోని పి.ఎస్.ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని సంగారెడ్డి శాసనసభ నియోజకవర్గ పరిధిలోని కంది, కొండాపూర్, సదాశివపేట, సంగారెడ్డి మండలాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకం కింద చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం రూ.2.54 కోట్ల విలువైన చెక్కులను 254 మంది లబ్ధిదారులకు మంత్రి అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజలకు సామాజిక, ఆర్థిక, విద్యా, వైద్య భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యతని అన్నారు. ఆ దిశగా పేదల ఆరోగ్య భద్రత, వైద్య రక్షణకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతోందన్నారు. మహిళల ఉన్నతికి మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ, పిల్లలకు నైపుణ్యాలు, ప్రమాణాలతో కూడిన విద్య అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు.స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడంలో భాగంగా వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా బాల భరోసా కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. వయోవృద్ధుల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక బాధ్యత తీసుకుని ప్రణామ కార్యక్రమం ద్వారా వృద్ధుల డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేసిందని మంత్రి వివరించారు.ప్రజల ఆరోగ్య భద్రత ప్రభుత్వానిదేనని, ప్రతి పేదవాడికి నాణ్యమైన వైద్య చికిత్సలు అందించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఒకప్పుడు క్యాన్సర్ చికిత్స కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలోనే క్యాన్సర్ చికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో కంటి సంబంధిత కాట్రాక్ట్ శస్త్రచికిత్సలు సహా అన్ని ఆధునిక వైద్య సేవలను సంగారెడ్డి ఆసుపత్రిలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి వెల్లడించారు.టి.జి.ఐ.ఐ.సి చైర్పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, అడగకుండానే ప్రజలకు ఏం కావాలో తెలుసుకుని అందించే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రజలకు అన్ని విధాల అండగా నిలుస్తోందన్నారు. ఇంటి స్థలం ఉన్నా లేకపోయినా ఎమ్మార్వోకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు గ్రామాభివృద్ధికి పాటుపడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజయ్య, ఆర్డిఓ రాజేందర్, డాక్టర్ మౌనిక, తహసిల్దార్లు, లబ్ధిదారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# వాసవి మాత ఆశీస్సులు పిఠాపురం ప్రజలందరిపై ఉండాలి

మంగళ వాయిద్యాలతో వేద పండితులు మంత్రోచ్ఛన్నమధ్య రామస్వామి (బాబు)కి పూర్ణకుంభంతో స్వాగతం పలికి, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా తుమ్మల రామస్వామి (బాబు) మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పవన్ కళ్యాణ్ ఇచ్చిన మాట ప్రకారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం ప్రభుత్వ లాంఛనంగా చేయడానికి నిర్ణయించడం జరిగిందని, దానిలో భాగంగా ఈరోజు పిఠాపురం నియోజకవర్గంలో పిఠాపురం నియోజకవర్గ శాసనసభ్యుడు, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పిఠాపురం పట్టణం కోటగుమ్మంలో ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించడం జరిగిందన్నారు. అదేవిధంగా ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో అధికారకంగా చేయడం జరుగుతుందని తెలియజేశారు. అనంతరం ఆర్యవైశ్య మహిళలకు పసుపు కుంకుమ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు దంగేటి సత్తిపండు, ట్రెజరర్ తాతాజీ, ఐవిఎఫ్ అధ్యక్షుడు కేతవరపు కృష్ణ, ఎం.వి.ఎస్.రమేష్, పిఠాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ వాకపల్లి దేవి సూర్యప్రకాష్, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సూరిశెట్టి జయకృష్ణ, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే జగదీష్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ దానం లాజర్ బాబు, సగర కార్పొరేషన్ డైరెక్టర్ మొగిలి అప్పారావు, నక్క నారాయణామూర్తి, పిఠాపురం మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉమ్మడి అమలేశ్వరి, పిఠాపురం జనసేన నాయకులు బొజ్జా లోవరాజు, కొత్తెం సుందర్, మర్నీడి రంగబాబు, వెన్న జగదీష్, కడారి తమ్మయ్య నాయుడు, బస చిట్టిబాబు, మామిడాల సూరిబాబు, బాలిరెడ్డి గంగబాబు, కరణం సూరిబాబు, వీర మహిళలు డాక్టర్ వరలక్ష్మి, కమల, ఆకుల దుర్గ, ఆకుల గంగా భవాని, భాను శ్రీ, కుక్కల నాగమణి, నియోజకవర్గ జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతి హామీని నెరవేరుస్తా

- గ్రామ సభలో సర్పంచ్ బ్యాగరీ రాజు

జోగిపేట్)



ఆందోల్ నియోజకవర్గం లోని చౌటాకు ర్ మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో మొదటిసారిగా నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచ్ బ్యాగరి రాజు మాట్లాడుతూ రానున్న వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని గ్రామ ప్రజలకు ఎలాంటి మంచినీటి కష్టం రాకుండా చూస్తానని మురికి కాలువలు విద్యుత్ లైట్లు ఎప్పటికప్పటికి పర్యవేక్షిస్తానని ఉపాధి హామీ ఎలాంటి లోటు లేకుండా ప్రతి కుటుంబానికి జాబ్ కార్డు అందిస్తానని ఉపాధి హామీ పథకంలో ఏవైనా లోటు ఉంటే నా దృష్టికి తేవాలని అదేవిధంగా గ్రామ అభివృద్ధి నా అభివృద్ధి ప్రణాళికలు వంటి అంశాలపై ప్రధాన దృష్టి సారిస్తానని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మన్నే మహేందర్ పంచాయతీ సెక్రెటరీ సులామతి వార్డు మెంబర్లు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి ఆ వెంకటేశ్వర స్వామి బుద్ధి, జ్ఞానం ప్రసాదించాలని కోరుకుంటున్నాను

ఆయన ఆరోపణలన్నీ తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆలయ అభివృద్ధికి చేపట్టిన పనులను వివరించారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక ఇంచుమించుగా రూ.43 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే రూ.4 కోట్ల అభివృద్ధి పనులను పూర్తిచేశామన్నారు. రూ.14 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతూ ఉన్నట్లు తెలిపారు. మరో రూ.26 కోట్ల అభివృద్ధి పనులు త్వరలో మొదలుపెట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికే నిధులు మంజూరై టెండర్లు పూర్తవడంతో సదరు పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. వైసిపి ఐదేళ్ల కాలంలో రూ 14 కోట్ల అభివృద్ధి పనులు జరిగితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ 18 నెలల కాలంలోనే సుమారు రూ.43 కోట్ల పనులను చేపట్టామన్నారు. ఇక ఆదాయం చూసుకుంటే 2023 -24 సంవత్సరంలో రూ.28,88,56,753 (28కోట్ల 88లక్షల 56వేల 753) కాగా ఖర్చు రూ.26,53,94,978లు (26కోట్ల 53లక్షల 94వేల 978) రూపాయలుగా ఉందని మిగిలిందల్లా రెండు కోట్ల ముప్పై లక్షలు మాత్రమేనని తెలియజేశారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక 2024 - 25 సంవత్సరంలో వచ్చిన ఆదాయం రూ.39,09,63,695 (39 కోట్ల 9 లక్షల 63వేల695), ఖర్చు రూ.32,01,15,481 రూపాయలుగా ఉందని అంటే ఏడు కోట్ల రూపాయలు ప్రభుత్వం వచ్చిన మొదటి సంవత్సరంలోనే నిల్వ రావడం జరిగిందన్నారు. బ్యాంకు నిల్వలు చూసుకుంటే వైసిపి ప్రభుత్వంలో రూ.5,48,66,404లు ఉంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నేటికి రూ.27,82,28,506లు నిల్వలుగా ఉన్నాయని తెలిపారు. ఈ 18 నెలల కాలంలోనే ఎంత ఆదాయం వచ్చిందో ఈ లెక్కలు బట్టి తెలుస్తుందన్నారు. గతంలో డిపాజిట్లను చూసుకుంటే 2019 నాటికి రూ.4.50కోట్లు ఉన్నాయని, వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.5.27కోట్లు డిపాజిట్ చేయడం జరిగిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఈ 17 నెలల్లోనే రూ.11,48,29,787లు డిపాజిట్లు చేయడం జరిగిందన్నారు. ఆ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఐదు కోట్లు డిపాజిట్ చేస్తే ఈ 18 నెలల్లోనే రూ.11 కోట్లకు పైగా డిపాజిట్ చేయడం జరిగిందన్నారు. ఇక షాపుల వల్ల ఆదాయం విషయానికొస్తే రూ.2,07,94,568లుగా ఉంటే 25 - 26 సంవత్సరానికి గాను రూ.4,23,31,889లుకు పెరిగిందన్నారు. షాపుల వల్ల ఆదాయం, భూముల వల్ల ఆదాయం, కొబ్బరి చెక్కల వల్ల ఆదాయం, పార్కింగ్ వల్ల ఆదాయం డబల్ అయిందన్నారు. ఒక కొబ్బరి చెక్కల వల్ల వచ్చే ఆదాయమే రూ.37 లక్షలు వరకు పెరిగిందన్నారు. పార్కింగ్ వల్ల ఆదాయం రూ.43 లక్షల వరకు పెరిగిందన్నారు. షాపుల వల్ల గతంలో రూ.54 లక్షల ఆదాయం ఉంటే రూ.1కోటి 20లక్షల వరకూ ఆదాయం పెరిగిందన్నారు. హుండీల వల్ల ఆదాయం వైసీపీ ప్రభుత్వ హయాంలో నెలకు రూ.52,51,000లుగా ఉంటే కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక హుండీ ఆదాయం రూ.1,87,33,329లు గా పెరిగిందన్నారు. నాలుగు రెట్లు హుండీ ఆదాయం పెరిగిందన్నారు. సంవత్సరానికి ఆదాయం వైసిపి హయాంలో రూ.25,81,60,349లు కాగా 25 - 26 సంవత్సరంలో రూ.40,56,99,604లుగా ఉందన్నారు. ఒక్క ఏడాదిలోనే రూ.14 కోట్లకు పైగా ఆదాయం పెరిగిందన్నారు. వైసిపి హయంలో స్వామి వారి కళ్యాణం ఖర్చులు రూ.1,20,74,000లు కాగా కూటమి అధికారంలోకి వచ్చాక 79,09,248లు మాత్రమే అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కన్నా స్వామి వారి కళ్యాణం ఖర్చులు సుమారు రూ.40 లక్షలు ఖర్చు తగ్గించి ఆదా చేసామన్నారు. ఈ విధంగా కోనసీమ తిరుమల వాడపల్లిని అభివృద్ధి చేస్తూ ఉంటే తట్టుకోలేకపోతున్నారని, ఎందుకు ఇబ్బంది పడుతున్నారో అర్థం కావటం లేదన్నారు. గత ఐదేళ్లు రూములు కట్టకుండా గుడ్డి గుర్రం పళ్ళు తోమేరా? అని ప్రశ్నించారు. ప్రస్తుతం 54 రూములు నిర్మాణంలో ఉన్నాయన్నారు. నాలుగు డార్మెటీరీల నిర్మాణం చేపట్టామన్నారు. రూ.12కోట్లు మంజూరు అయ్యాయన్నారు. త్వరలోనే మంత్రి ఆనం చేతుల మీదుగా శంకుస్థాపన చేసి వాటి నిర్మాణం మొదలు పెడతామన్నారు. ఒక ఎమ్మెల్యే కానీ, మంత్రి కానీ, ఆఫీసర్ కానీ వస్తే కూర్చోవడానికి ఒక్క రూము కూడా నిర్మించకుండా గత వైసిపి ప్రభుత్వంలో ఏ విధమైన అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదు అన్నారు. ఛైర్మన్ రూమును తన సొంత డబ్బులతో అందంగా తీర్చిదిద్ది దేవాలయానికి ఇవ్వాలి అని ఛైర్మన్ అనుకుంటే దాని మీద కూడా విమర్శలు చేయడం సరికాదన్నారు. వాడపల్లి దేవాలయం అభివృద్ధి చెందటం మీకు ఇష్టం లేదా? అని ప్రశ్నించారు. గతంలో ఇక్కడ ఒక్క టాయిలెట్ నిర్మాణం కూడా చేయలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 140 టాయిలెట్స్ కట్టామని చెప్పారు. మహిళలు, వృద్ధులు ఇబ్బంది పడకుండా టాయిలెట్స్ కట్టామని క్యూలైన్స్ లో కూడా పోర్టబుల్ టాయిలెట్స్ ఏర్పాటు చేశామన్నారు. క్యూలైన్ లన్నీ టైం అవర్స్ పెట్టి ఇబ్బంది లేకుండా చేశామన్నారు. ప్రసాదాల నాణ్యత పెంచామన్నారు. నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నామన్నారు. వ్యాఖ్యలు భక్తుల రద్దీ నియంత్రణలో ఉండేలా ద్వారాలు వెడల్పు చేసి అయిదారు గంటలు పట్టే దర్శనాన్ని భక్తులకు ఇబ్బంది లేకుండా చేసామన్నారు. భక్తుల యొక్క సౌకర్యం, యోగక్షేమాలు ముఖ్యమని ఆలోచనతో ముందుకు వెళ్తున్నామన్నారు. పచ్చకామెర్లు వాడికి అంతా పచ్చగా కనపడినట్లుగా అవినీతితో నిండిపోయిన మీకు అందరు అవినీతిపరులుగా కనపడుతున్నారా? అని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే పూర్తిగా అవినీతిలో నిండిపోయినట్లుగా రాష్ట్రం అంతా తెలుసన్నారు. మీరు దోపిడీదారుడు అయితే అందరూ దోపిడీదారులు అవుతారా? అని ప్రశ్నించారు. హుండీ లెక్కింపుకు వచ్చిన వ్యక్తి రూ.52,000 దొంగతనం చేశారని తెలియగానే అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయించామన్నారు. అతడు 17 రోజులు జైల్లో గడిపాడని తెలిపారు. డూప్లికేట్ టికెట్లు తీసి మోసానికి పాల్పడిన ఉద్యోగిపై వెంటనే చర్య తీసుకున్నామన్నారు. వారి పై ఎఫ్ఐఆర్ ఫైల్ చేయడం జరిగిందన్నారు. వైసీపీ ప్రభుత్వ కాలంలో ఎవ్వరి మీదనైనా ఒక్క ఎఫ్ఐఆర్ అయినా ఫైల్ చేశారా? అని ప్రశ్నించారు. మీ హయాంలో జరిగిన ఎన్నో తప్పులు జరిగాయని, నలుగురు ఉద్యోగులు తప్పు చేస్తూ దొరికితే, నాలుగు నెలలు మానిపించి తిరిగి ఉద్యోగంలోకి తీసుకున్నారన్నారు. బొబ్బర్లంకకు చెందిన వ్యక్తి స్కామ్ చేస్తే అతనిపై కనీసం కేసు కూడా నమోదు చేయలేదని, ఎఫ్ఐఆర్ ఫైల్ చేయలేదని విమర్శించారు. ప్రతి వ్యవస్థలను లోపాలు జరుగుతాయని, అయితే చక్కదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తిరుమల తిరుపతి వంటి ప్రధానమైన ఆలయంలో సైతం ఏవో లోటుపాట్లు జరుగుతూ ఉంటాయని, అయితే వాటిని సరిదిద్దుతున్నారా లేదా అనేది చూడాలన్నారు. ఎన్డీఏ కూటమి నేతల దోపిడీ చేస్తున్నారని, పునరావాస కేంద్రంగా మార్చారని మాట్లాడడం సరికాదన్నారు. గత వైసిపి హయాంలో చైర్మన్ కుర్చీలో ఎవరు కూర్చుని ఇక్కడ అథారిటీ చేసేవారు అందరికీ తెలుసన్నారు. దేవస్థానంలో ఎవరైనా ఉద్యోగి తప్పు చేస్తే తప్పకుండా యాక్షన్ తీసుకుని సరిదిద్దుతామని, గత మీ ప్రభుత్వ హయాంలో కప్పి పుచ్చినట్లుగా చెయ్యమన్నారు. జరిగిన పొరపాట్లను భూతద్దంలో చూపటం విమర్శించడం సరికాదన్నారు. దేవాలయం అభివృద్ధి చెందడాన్ని ఓర్చుకోలేకపోతున్నారా? లేక తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత దేవాలయాన్ని బాధ్యతగా తీసుకొని అభివృద్ధి చేయడం నచ్చటం లేదా? లేక ఉనికి కోసం ఆరోపణలు చేస్తున్నారా? అనేది ఆలోచించుకోవాలన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక వాడపల్లిలో ఆదాయం కోసం చూడడం లేదని భక్తులకు సౌకర్యాలు కల్పన పైనే ఎక్కువ దృష్టి సారించామన్నారు. వృద్ధులకు, చంటి పిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేకమైన ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగులకు జీతాలను 15 వేల రూపాయలు చేసామని, ఈపీఎఫ్ పీఎఫ్ అందుబాటులోకి తెచ్చామని అన్నారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేశామన్నారు. భక్తుల సౌకర్యం కోసం ఫ్యాన్లు, 55 కూలర్స్ ఏర్పాటు చేశామన్నారు. నాలుగు బ్యాటరీ వాహనాలను దాతలు అందించారని తెలిపారు. ఎక్కడ ఏ అవసరం ఉంటే ఆ అవసరం తీర్చేలా పనిచేస్తున్నామన్నారు. రూ.20లక్షలతో జల ప్రసాదం ఏర్పాటు చేశామన్నారు. ముఖద్వారం నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. రోడ్లను వెడల్పు చేయడానికి ప్రభుత్వం నుంచి జీవో తీసుకువచ్చామన్నారు. డబుల్ లైన్ రోడ్డు సెంట్రల్ లో లైటింగ్ వచ్చేలాగా చేయాలని ఆలోచన చేస్తున్నామన్నారు. గోశాలను అందంగా తయారు చేయించి అక్కడ డార్మెటరీ కట్టాలని ప్లానింగ్ చేస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడడానికి కూడా ఒక పద్ధతి ఉంటుందని అన్నారు. నా (బండారు సత్యానందం) మీద కోపం ఉంటే వ్యక్తిగతంగా తనపైనే చూపాలని, తనను నేరుగా ఎదుర్కోవాలని, అంతేకానీ వాడపల్లి దేవాలయం అభివృద్ధిని మాత్రం అడ్డుకోకూడదన్నారు. రాజకీయాల్లోకి దేవాలయ అభివృద్ధిని లాగవద్దన్నారు. ఏమైనా తప్పులు జరిగితే ఛైర్మన్, డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారు. వాళ్లు తప్పులు సరిదిద్దకపోతే అప్పుడు మాట్లాడాలన్నారు. మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి బుద్ధి జ్ఞానం ఇవ్వాలని వెంకటేశ్వర స్వామిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి వాడపల్లి లో ఎక్కడైనా తప్పు జరిగినట్లు అనిపిస్తే నేరుగా రావాలని ఆఫీసులో కూర్చుని దానిపై ప్రశ్నిస్తే వారు తప్పకుండా సమాధానమిస్తారని తెలిపారు. అంతేకానీ వాడపల్లి దేవాలయాన్ని అప్రతిష్ట పాలు చేసేలాగా ప్రవర్తించవద్దన్నారు. ఆత్రేయపురం ఉత్సవానికి జాతీయస్థాయిలో పేరు వస్తే ఆ ఉత్సవం మీద కూడా విమర్శ చేశారన్నారు. ప్రభుత్వం నుంచి ఏ విధమైన నిధులు రాకుండానే, టూరిజం నుంచి నిధులు విడుదల కాకుండానే దోపిడీ ఆరోపణలు చేయటం హాస్యాస్పదంగా లేదా అని ప్రశ్నించారు. స్పాన్సర్ లిస్టును నేరుగా టీవీ స్క్రీన్ మీద, ఆహ్వాన పత్రిక మీద ప్రకటించామన్నారు. సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ అనే కమిటీ ఏర్పాటయిందని, దానికి ఇన్కమ్ టాక్స్ వెసులుబాటు కూడా అప్లై చేశారని, బ్యాంకు ఎకౌంటు కూడా ఉందని, బ్యాంక్ ఎకౌంట్ ద్వారానే లావాదేవీలు జరుగుతున్నాయని అన్నారు. ఆత్రేయపురం ఉత్సవంకు రిజిస్టర్ కమిటీ ఉందని అంతా క్లీన్ గా ఉందన్నారు. ఇది ఒక సంవత్సరంతో ముగించేసేది కాదన్నారు. మొన్న జరిగిన ఉత్సవం, సక్సెస్ కు ఇక్కడ ఒక ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ కూడా ఏర్పాటు చేసే ఆలోచన చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేష్ అభినందించారని, ఇవన్నీ చూసి ఓర్చుకోలేక అవినీతి ఆరోపణలు చేస్తున్నారన్నారు. కరోనా పేరిట ఆలమూరు షిరిడి సాయి ఆలయం వద్ద కూడా చందాలు వసూలు చేసిన ఘనత గత ప్రభుత్వంలో ఉందని, పంచాయతీల్లో బ్లీచింగ్ పేరు చెప్పి బిల్లులు తీసుకున్న ఘనత ఉందని, కరోనా పేరు చెప్పి ఎంత దోచేశారు..? ఆ భగవంతునికే తెలుసని అన్నారు.

# మంగళగిరిలో "ప్రాజెక్ట్ శక్తి" ఆడపిల్లల భవిష్యత్తుకు ఆరోగ్య రక్షణ

**- గర్భాశయ క్యాన్సర్ రాకుండా 2,300 మంది విద్యార్థినిలకు ఉచిత వ్యాక్సిన్**

**- మహిళ సాధికారత కోసం రోటరీ పని చేస్తోంది- ఎపిఎంఎస్ఐడిసి చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు**





మంగళగిరి, సింహగర్జన ప్రతినిధి, జనవరి 20 : గర్భాశయ క్యాన్సర్ వల్ల కుటుంబాలకు కుటుంబాలే చిధ్రమవుతున్న తరుణంలో 2,300 మంది విద్యార్థులకు వారి తల్లితండ్రులను ఒప్పించి వ్యాక్సిన్ వేయించడం అద్భుతమని ఇది వారి కుటుంబాలలో వెలుగులు నింపుతాయని.. ఈ ఘనత సాధించిన రోటరీ క్లబ్ తాడేపల్లి వారిని ఎపిఎంఎస్ఐడిసి చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు అభినందించారు. మంగళవారం నాడు తాడేపల్లిలోని వడ్డేశ్వరం డీజీపీ ఆఫీస్ పక్కన గోపు గ్రాండ్ కళ్యాణ మండపం నందు రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో రోటరీ ఇంటర్నేషనల్ సహకారంతో ప్రాజెక్ట్ శక్తిలో భాగంగా సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్ ప్రోగ్రాంలో ముఖ్యఅతిథిగా ఎపిఎంఎస్ఐడిసి చైర్మన్, జనసేన పార్టీ మంగళగిరి ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిఎంహెచ్ఓ అలానే జిల్లా వైద్య శాఖ సహకారంతో 50 మందికి పైగా సిబ్బందిని ఈ కార్యక్రమానికి పంపించామని అన్నారు. తనను ఇక్కడికి ప్రత్యేకంగా ఆహ్వానించిన రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ప్రెసిడెంట్ శెట్టి రామకృష్ణకు, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి పబ్లిక్ ఇమేజ్ డైరెక్టర్, జనసేన యువ నాయకుడు జొన్న రాజేష్ కు, క్లబ్ వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఇలాంటి మహా సేవా కార్యక్రమాలను రోటరీ క్లబ్ తాడేపల్లి ఆధ్వర్యంలో, రోటరీ క్లబ్ ఢిల్లీ సౌత్ మరియు ఫరీదాబాద్ వన్ మద్దతుతో నిర్వహించడం ఎంతో ప్రశంసనీయమన్నారు. హెచ్పివి వ్యాక్సిన్ ఆడపిల్లలకు భవిష్యత్తులో క్యాన్సర్ రక్షణ ఇస్తుంది. వారి కుటుంబాలకు భరోసా కల్పిస్తుందని, సమాజానికి మేలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమం భవిష్యత్తులో మరిన్ని ఆరోగ్య, అవగాహన సేవలను ప్రేరేపించగలదని నమ్మకం. ఇది కేవలం టీకా ఇవ్వడం మాత్రమే కాదు, భవిష్యత్తుకు పెట్టుబడిగా, ఆరోగ్య పరిరక్షణలో ఒక ముఖ్యమైన అడుగు అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా హెచ్పివి వ్యాక్సినేషన్ పై అవగాహన పెరగడం, సమాజంలో ఆరోగ్య సురక్షణకు కొత్త ప్రమాణాలను స్థాపించడం, మరియు భవిష్యత్తులో క్యాన్సర్ నివారణలో కీలకమైన అడుగులు వేయడం సాధ్యమైందన్నారు. ప్రాజెక్ట్ శక్తి ఒకే రోజు, ఒకే స్థలంలో, వేల ఆడపిల్లలకు ఆరోగ్య భద్రత అందించడంలో ఒక చారిత్రక సంఘటనగా నిలిచిందన్నారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులతో మాట్లాడి దగ్గరుండి వారికి వ్యాక్సిన్లు వేయించారు. జిల్లా వైద్య యంత్రంగాంతో మాట్లాడి ఏర్పాట్లను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ రాంప్రసాద్, ఫాస్ట్ గవర్నర్ రవి వడ్లమాని, ప్రాజెక్ట్ శక్తి చైర్మన్ రాజశేఖర్ రెడ్డి తాళ్ల, డిస్టిక్ 3100 క్యాన్సర్ ఇనిషియేటివ్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వందన బల్ల, రవీందర్ గుగాని, రోటరీ క్లబ్ తాడేపల్లి సెక్రటరీ శ్రావణి, ట్రజరర్ వెంకట నాగేష్, ప్రాజెక్ట్ చైర్మన్ జంగాల వెంకటేష్, పరుచూరి కిరణ్, రోటరీ సభ్యులు గోపు నాగరాజు, శ్రీకాంత్, జగదీష్, కాట్రగడ్డ శివన్నారాయణ, వివేకానంద రెడ్డి, పాస్ట్ ప్రెసిడెంట్ రమేష్, రోటరీ క్లబ్ సభ్యులు, విద్యార్థినిల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ సభలు నిలుపుదల చేయాలి

**- ఆలయ ఈఓకు పిర్యాదు చేసిన విశ్వ హైందవ పరిషత్ రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు**



అన్నవరం, సింహగర్జన ప్రతినిధి, జనవరి 20 : అన్నవరం రత్నగిరి కొండ పై 20వ తేదీ నుండి 24వ తేదీ వరకు బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ సమాజ సభలు నిలుపుదల చెయ్యమని తెలుపుతూ విశ్వ హైందవ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు దువ్వ వెంకటేశ్వర్రావు, ఉప అధ్యక్షుడు సూర్య ఆకొండి, కార్యదర్శి మణికుమార్ అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థాన కార్యనిర్వాహణాధికారికి పిర్యాదు చేశారు. ఆగమశాస్త్ర నియమాలతో నిత్యం వేద పారాయణలతో వైదిక పూజా ప్రక్రియలతో ఆరాధించే సత్యన్నారాయణ స్వామి పుణ్యక్షేత్రమైన అన్నవరం కొండపై, హిందువులు భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా, ఏమాత్రం హిందూ ఆచార వ్యవహారాలతో సంబంధం లేని, పాటించని అవైదిక వ్యవహారాలు అనుసరించే బ్రహ్మకుమారీస్ సమాజం వారు సభలు నిర్వహించడానికి అనుమతి కొండపై ఇవ్వడం సరికాదు అని, తక్షణమే అనుమతిని రద్దు చెయ్యాలని విశ్వ హైందవ పరిషత్ సభ్యులు విజ్ఞప్తి చేశారు. హిందువుల యొక్క ధనం మరియు దేవాదాయ నిధులను దుర్వినియోగం అయ్యేలా వారికి ఉచితంగా స్థలం మరియు సగం అద్దెకు వసతి గృహాలు ఇవ్వడాన్ని కూడా వ్యతిరేకిస్తున్నాం అని వారు తెలిపారు. ఇప్పుడే కాదు భవిష్యత్తులో కూడా ఇటువంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దేవదాయశాఖ నియమ నిబంధనల ప్రకారం కొండపైకిగాని, ఆలయ ప్రాంగణంలోకిగాని అన్యమతస్థుల ఫొటోలుగాని, ప్రకటనలుగాని చేయరాదు. వారి వద్ద ఉన్న పుస్తకములలో వీటికి విరుద్ధముగా యేసు క్రీస్తు ఫోటోలు మజీద్ ఫోటోలు, అన్యమత ప్రస్తావన పుస్తకాలు ఉన్నాయి అని, వీటి పై చర్యలు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. పిర్యాదుకి ఆలయ ఈఓ స్పందించకపోవడంతో రేపు చలో అన్నవరం కార్యక్రమానికి విశ్వ హైందవ పరిషత్ పిలుపు నిచ్చింది. దీనితో విషయం ఉన్నత అధికారుల దృష్టికి వెళ్లడంతో వెంటనే స్పందించిన అధికారులు బ్రహ్మకుమారీస్ కార్యక్రమంని నిలుపుదల చేశారు. ఈ కార్యాచరణలో పురోహిత సంఘం లక్ష్మణ్ శర్మ, జయ హనుమాన్ సేవా సమితి సురేంద్ర దత్త, కృష్ణమాచార్యులు, రామకృష్ణ, రామ లింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కిల్కారి కాల్ సేవలు

**- గర్భిణీలు, బాలింతలకు ప్రయోజనాలు**




మార్కాపురం జిల్లా ప్రతినిధి, సింహగర్జన (ముత్యాల నరేష్ రెడ్డి) జనవరి 20 : మంగళవారం బోట్లగూడూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు కిల్కారి ప్రోగ్రాం పైన శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కిల్కారి ప్రోగ్రాం ఆఫీసర్ రాజు కిల్కారి కాల్ సర్వీస్ పైన ఆశా వర్కర్లు, ఏఎన్ఎంఎస్, ప హెచ్ఎస్ స్టాఫ్ కి అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం కిల్కారి ప్రోగ్రాంను గర్భిణీ, బాలింతల కొరకు ప్రవేశం పెట్టటం జరిగిందన్నారు. ఈ కిల్కారి కాల్ ద్వారా తల్లీ మరియు బిడ్డల యొక్క ఆరోగ్య సమాచారం అందిచబడుతుంది. ఈ కిల్కారి కాల్స్ గర్భిణీ 4వ నెల మొదలుకొని పుట్టిన బిడ్డ సంవత్సరం వరకు వస్తాయి. ఈ కిల్కారి వాయిస్ కాల్స్ నెలకు ఒకసారి గర్భిణీ, బాలింతల యొక్క మొబైల్స్ కి వస్తాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే కిల్కారి కాల్ నెంబర్ 911600403660 ఈ కాల్ నెంబర్ ని గర్భిణీలు మరియు బాలింతలు వాళ్ళ మొబైల్ లో సేవ్ చేసుకున్నట్ల అయితే కాల్ వచ్చినపుడు ఎత్తి పూర్తిగా సమాచారాన్ని వినగలుగుతారు. ఒక వేళ మరల తిరిగి ఆ సమాచారాన్ని వినాలి అంటే 14423 అనే టోల్ ఫ్రీ నెంబర్ కి చేసి వినవచ్చు అని తెలియజేశారు. ఈ కిల్కారి సేవలను గర్భిణీలు, బాలింతలు ఉపయోగిశీచుకోవాలిని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దాదా షరీఫ్, డాక్టర్ రవళి ప్రియాంక, హెచ్ఈఓ శ్రీధర్, పిహెచ్ఎన్ సరళమ్మ, ఏఎన్ఎం మరియు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.





# వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు

**- పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**



కొత్తపేట, సింహగర్జన ప్రతినిధి, జనవరి 20 : స్త్రీల ఆత్మ గౌరవానికి వాసవీ అమ్మవారు ప్రతీకగా నిలిచారని, వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులు కొత్తపేట నియోజకవర్గ ప్రజలందరి మీద ఉండాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా మంగళవారం కొత్తపేటలో ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు అందజేశారు. ఆర్యవైశ్యులకు ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు.

# ఎన్ హెచ్ 216 ఏ జంక్షన్ వద్ద లూప్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



కొత్తపేట, సింహగర్జన ప్రతినిధి, జనవరి 20 : రావులపాలెం కళా వెంకట్రావు సెంటర్ వద్ద జాతీయ రహదారి 216 ఏ కు అటు అమలాపురం ఇటు బొబ్బర్లంక రహదారులను అనుసంధానం చేసే లూప్ రోడ్డు నిర్మాణం నిమిత్తం మంగళవారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కొత్తపేట జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్ తో కలిసి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. రూ.25 లక్షలతో అభివృద్ధి చేయనున్న ఈ లూప్ రోడ్ నిర్మాణం వల్ల కళా వెంకట్రావు సెంటర్ వద్ద వాహనదారులు పడుతున్న ఇబ్బందులు తొలిగిపోతాయని ఆయన అన్నారు. సెంటర్ వద్ద రహదారుల పరిస్థితులను నిశితంగా పరిశీలించారు. ట్రాఫిక్ జాములు నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ పై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి



మార్కాపురం జిల్లా ప్రతినిధి, సింహగర్జన (ముత్యాల నరేష్ రెడ్డి) జనవరి 20 : ఆటో డ్రైవర్ పై అమానుషంగా దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్ మౌలాలి మరియు సిపిఐ మండల కార్యదర్శి పోతల ప్రభాకర్ అన్నారు. స్థానిక గుజ్జుల యల్ల మందారెడ్డి భవన్ లో మంగళవారం మండల కార్యదర్శి ప్రభాకర్ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్ మౌలాలి మాట్లాడుతూ చీమలదీన్నే మహర్షి పై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని, అవసరమైతే ప్రజా సంఘాలు కలుపుకొని ఉద్యమం చేస్తామన్నారు. మార్కాపురం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజును కలవడం జరుగుతుందని వారు తెలిపారు. అంతేకాకుండా రజక సంఘం నాయకులకు సిపిఐ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని సయ్యద్ మౌలాలి తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి పోతల ప్రభాకర్ మాట్లాడుతూ దళితులు, బహుజనులు పై జరిగే దాడులను ప్రభుత్వాలు అరికట్టాలని, ఆటో డ్రైవర్ చీమల దీన్నే మహర్షి వ్యక్తికి ఆటో తగిలిందని, అతనిని స్తంభానికి వస్త్రాలు విప్పి కట్టేసి కొట్టారనేది అమానుష నేరం. అన్ని రంగాలలో అభివృద్ధి జరుగుతున్న దళితులు, బహుజనులపై జరుగుతున్న దాడులను ఆపలేకపోతున్నామని వారు ఆరోపించారు. వెంటనే మహర్షి మీద దాడి చేసిన వారందరి మీద కేసులు నమోదు చేయాలని వారు కోరారు. అలాగే బాధితుని బంధువులకు కూడా రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. మరలా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి వజ్రాల సుబ్బారావు, మండల సహాయ కార్యదర్శి పాలపర్తి మస్తాన్ రావు, ఆకుల మోహన్ రావు, లోకసాని రమణయ్య, సూరీపోగు దేవకుమార్, చీమలదిన్నె మాలకొండయ్య, దేవరాజు గట్టు హరీష్, మహేంద్ర, అనిల్, మధుబాబు, రజక సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విజయ్ సేతుపతితో మణిరత్నం సినిమా

## -హీరోయిన్‌గా సాయిపల్లవి ఖరారు


తనదైన నటనతో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న తమిళ నటుడు విజయ్ సేతుపతి వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన సూపర్ స్టార్ రజనీకాంత్ తో జైలర్ 2 తో పాటు టాలీవుడ్ దర్శకుడు పూరి జగన్నాథ్ డైరెక్షన్ లో స్లమ్ డాగ్ అనే సినిమా అలాగే మరికొన్ని చిత్రాల్లో నటిస్తున్నారు. ఇదిలా ఉండగా విజయ్ సేతుపతి నెక్స్ట్ సినిమాపై కోలీవుడ్ లో ఒక ఆసక్తికర చర్చ జరుగుతుంది. తాజా సమాచారం ప్రకారం, విజయ్ సేతుపతి ప్రముఖ దర్శకుడు మణిరత్నం దర్శకత్వంలో ఓ సినిమాలో నటించనున్నారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ కథను మణిరత్నం తొలుత సిలంబరాసన్ టీఆర్ శింబు కోసం



రాసుకున్నారట. అయితే కొన్ని కారణాల వల్ల శింబు ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం లేదట. దీంతో అదే కథకు విజయ్ సేతుపతిని హీరోగా ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో విజయ్ సేతుపతికి జోడీగా సాయి పల్లవి నటించనున్నారు. సహజమైన నటనకు పేరు తెచ్చుకున్న సాయి పల్లవి, సుప్రసిద్ధ దర్శకులు మణిరత్నం డైరెక్షన్, విజయ్ సేతుపతి లాంటి పవర్‌ఫుల్ నటుడు కలిసి చేసే ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్ లో ఉంటాయనడంలో సందేహం లేదు. ప్రస్తుతం చేస్తున్న సినిమాల తర్వాత విజయ్ సేతుపతి కెరీర్‌లో ఈ మణిరత్నం సినిమాను సెట్స్ పైకి తీసుకువెళ్లాలా ఎ÷-లాన్ చేస్తున్నారట. ఈ చిత్రం సేతుపతి కెరీర్ లో ఓ ప్రత్యేకమైన మైలురాయిగా నిలిచే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.









# బాస్ ఈజ్ బ్యాక్...

### చిరంజీవి చిత్రంపై అల్లు అర్జున్ సూపర్ ట్వీట్

మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా, సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రంపై ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రశంసల వర్షం కురిపించారు. సినిమా అద్భుతంగా ఉందని, మెగాస్టార్ మళ్లీ తెరపై వెలుగులు నింపడం చూసి చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. "బాస్ ఈజ్ బ్యాక్" అంటూ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా తన పూర్తి అభిప్రాయాన్ని పంచుకున్నారు."మన శంకర వరప్రసాద్ గారి మొత్తం చిత్ర బృందానికి నా అభినందనలు. మన బాస్ మళ్లీ వచ్చాడు. మన మెగాస్టార్ చిరంజీవి గారిని మళ్లీ తెరపై చూడటం చాలా ఆనందంగా ఉంది. పూర్తి వింటేజ్ వైబ్స్ కనిపించాయి" అని అల్లు అర్జున్ తన పోస్టులో పేర్కొన్నారు. సినిమాలో కీలకపాత్ర పోషించిన వెంకటేశ్ గారి నటన అద్భుతంగా ఉందని, ఆయన షోను రాక్ చేశారని కితాబిచ్చారు. 'వెంకీ గౌడ' పాత్రను ఉద్దేశిస్తూ కన్నడలో "తుంబ చెన్నాగి మాడిదిరా" (చాలా బాగా చేశారు) అని ప్రత్యేకంగా అభినందించారు. నయనతార గ్రేస్ ఫుల్ ప్రజెన్స్‌తో ఆకట్టుకోగా, కేథరిన్ ట్రెసా తన హాస్యంతో అలరించిందని తెలిపారు. ఈ చిత్రంలోని 'బుల్లిరాజు' పాత్రలో నటించిన బాలనటుడిని 'సంక్రాంతి స్టార్' అంటూ ప్రత్యేకంగా ప్రశంసించారు. 'హూక్ స్టెప్', 'మెగా విక్టరీ' వంటి పాటలు విజిల్స్ వేయించేలా ఉన్నాయని, సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియోకు అభినందనలు తెలిపారు. నిర్మాతలు నా సోదరి సుస్మిత కొణిదెల, సాహు గారపాటిలకు శుభాకాంక్షలు అంటూ తన పోస్టులో పేర్కొన్నారు. దర్శకుడు అనిల్ రావిపూడిని 'సంక్రాంతి బ్లాక్‌బస్టర్ మెషిన్' అని అభివర్ణించిన బన్నీ, "సంక్రాంతికి వస్తారు - హిట్ కొడతారు - రిపీట్" అంటూ ఆయనపై ప్రశంసలు గుప్పించారు. చివరగా, ఈ చిత్రం కేవలం సంక్రాంతి బ్లాక్‌బస్టర్ మాత్రమే కాదని, ఇది ఒక "సంక్రాంతి బాస్-బస్టర్" అంటూ తనదైన శైలిలో ముగించారు. అల్లు అర్జున్ చేసిన ఈ సుదీర్ఘ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది



CHIRANJEEVI K

"మన శంకరవరప్రసాద్ గారు" చిత్రంకి ప్రేక్షక దేవుళ్లు చూపిస్తున్న ఆదరణ మరియు అపూర్వమైన విజయాన్ని చూస్తుంటే నా మనసు కృతజ్ఞత భావనతో నిండిపోతోంది.

నేను ఎప్పుడూ చెప్పేది నమ్మేది ఒక్కటే - నా జీవితం మీ ప్రేమాభిమానాలతో ముడిపడింది. మీరు లేనిదే నేను లేను. ఈ రోజు మళ్లీ అదే నిజమని మీరు నిరూపించారు.

ఈ విజయం పూర్తిగా నా ప్రియమైన తెలుగు ప్రేక్షకులది, నా ప్రాణసమానమైన అభిమానులది, నా డిస్ట్రిబ్యూటర్లది, సినిమాకు ప్రాణం పెట్టి పనిచేసిన ప్రతీ ఒక్కరిది మరియు ముఖ్యంగా దశాబ్దాలుగా నా వెంట నిలబడి ఉన్నవారందరిది.

వెండితెర మీద నన్ను చూడగానే మీరు వేసే విజిల్స్, చప్పట్లే నన్ను నడిపించే నా శక్తి. రికార్డులు వస్తుంటాయి – పోతుంటాయి , కానీ మీరు నాపై కురిపించే ప్రేమ మాత్రం శాశ్వతం.

ఈ బ్లాక్‌బస్టర్ విజయం వెనుక ఎంతో కృషి చేసిన మా దర్శకుడు HIT MACHINE అనిల్ రావిపూడికి, నిర్మాతలు సాహు & సుస్మితలకు, అలాగే మొత్తం టీమ్ అందరికీ, నాపై మీరందరూ చూపిన అచంచలమైన నమ్మకానికి ధన్యవాదాలు..

ఈ సంబరాన్ని అలాగే కొనసాగిద్దాం.
మీ అందరికీ ప్రేమతో... లవ్ యూ ఆల్

మీ చిరంజీవి

Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com